క్లుప్తంగా

నేటి నుంచి వాటర్ ప్లాంట్లు బంద్

చెన్నూర్: వాటర్ ప్లాంట్లలో ఐఎస్ఓ ప్రమాణాలు పాటించాలని చెన్నూర్ మున్సిపల్ అధికారులు ఒత్తిడి చేస్తుండడంతో సోమవారం నుంచి వాటర్ ప్లాంట్లు బంద్ చేస్తున్నట్లు యజమానులు తెలిపారు. ఐఎస్ఓ స్టాండర్ సర్టిఫికెట్ కావాలంటే రూ.25 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. ఉపాధి అవకాశాలు లేక పొట్ట తిప్పలు కోసం వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నామని పేర్కొన్నారు. వాటర్ ప్లాంట్ల నీటితోనే డయేరియా ప్రబలిందని అధికారులు ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. మున్సిపల్ తాగునీటి పైపులు అడుగడుగునా లీకేజీలు ఉన్నాయని, మున్సిపల్ సరఫరా చేస్తున్న నీటితోనే డయేరియా ప్రబలే అవకాశం లేదా అని ప్రశ్నించారు.

కత్తెరసాలలో బోనాలు



పట్నాలు వేస్తున్న భక్తులు

చెన్నూర్‌రూరల్: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని మండలంలోని కత్తెరసాల గ్రామంలోని శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మొక్కులు తీర్చుకున్నారు. అల్లుబండ వద్ద అల్లు పట్టారు. ఆలయ ఆవరణలో బోనాలు పోసి తీపి పదార్థాలను స్వామి వారికి నైవేద్యంగా పెట్టారు. ఒగ్గు పూజారులు పట్నాలు వేశారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు సన్మానం



సత్తయ్యను సన్మానిస్తున్న స్నేహితులు

జన్నారం: మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బెడద సత్తయ్యను ఆదివారం 1991–92బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్ననాటి స్నేహితులు రాజకీయంగా ఎదగడం ఆనందంగా ఉందని, ఇలాంటి మంచి పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. మాజీ సర్పంచ్ బొంతల మల్లేశ్, పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, బుచ్చన్న, ముజీబోద్దీన్, రమేశ్, నరేందర్, శ్రీధర్, సురేశ్, సతీశ్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

దండేపల్లి: మండలంలోని కొర్విచెల్మ గ్రామ సమీపంలో ఓ రహస్య ప్రదేశంలో ఆదివారం పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు. వారి నుంచి రూ.3100 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

‘ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు’

పాతమంచిర్యాల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటిస్తున్నామని తెలంగాణ జనసమితి పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బి.బాబన్న అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీకి తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

ఓదెలు ఆరోగ్యం మెరుగుపడాలని ప్రార్థనలు

మందమర్రిరూరల్: చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు నల్లాల ఓదెలు అనారోగ్యంతో సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఓదెలు ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని మెస్సియా చర్చి ఫాస్టర్ జాన్‌ప్రసాద్ సంఘ సభ్యులతో కలసి ఆదివారం చర్చిలో ప్రత్యేక ప్రార్థన చేశారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

చెన్నూర్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్ అన్నారు. స్థానిక తాపీమేస్త్రీ సంఘ భవనంలో ఆదివారం సీఐటీయూ మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బాధ్యతలు అప్పగించడంతో పనిభారం పెరిగిందన్నారు. మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ టీచర్లుగా గుర్తించినప్పటికీ, వేతనం మాత్రం మినీ టీచర్ వేతనం ఇస్తున్నారని ఆరోపించారు. ఇంటి అద్దె పెంచాలని, కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగు పర్చాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘం నాయకురాళ్లు ప్రవీణ, శారదా, విజయ, ఉమారాణి, కరీంబీ, చందులు పాల్గొన్నారు.



రైలుబడి

భీమారం: మండలంలోని బూర్గుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నూతనంగా ఆలోచించారు. ప్రైవేటుకు ధీటుగా విద్యార్థులకు ఆకర్షణగా ఉండేలా తరగతి గోడలపై రైలుబోగీ చిత్రాలు గీయించారు. ప్రైవేట్ పాఠశాలకు విద్యార్థులు మొగ్గు చూపుతున్న ఈ రోజుల్లో, ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని పలువురు అభినందిస్తున్నారు.



ఇసుక తోడేస్తున్నారు..!

భీమిని: అనుమతి లేకుండా భీమిని, కన్నెపల్లి మండలాల్లోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక తోడేస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు కొంత, అక్రమ రవాణే అంతా అనే ఆరోపణలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నిర్లక్ష్యానికి నిదర్శనం

భీమిని: హరితహారంలో భాగంగా గ్రామాలు, మండలాల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల లక్ష్యం మేరకు మొక్కలు పెంచుతున్నా, మరికొన్ని చోట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. భీమిని, కన్నెపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు లేకుండా ఇలా ఖాళీ మట్టి కవర్లు దర్శనమిస్తున్నాయి.

మోడు వారినా అందమే..

చెన్నూర్‌రూరల్: మండలంలోని కాచన్‌పల్లి గ్రామానికి వెళ్లే రహదారి పక్కనే ఉన్న పచ్చని వరి పంట పొలాల్లో ఓ చెట్టు మోడువారి అందంగా కనిపిస్తోంది. అటు వైపుగా వెళ్లే చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.



హైమాస్ట్ లైట్లు.. చెట్టుకు బిగించినట్లు!

దండేపల్లి: మండలంలోని నాగసముద్రంలో బస్టాప్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ల స్తంభానికి కొద్ది దూరంలో ఊడల మర్రి చెట్టు ఉంది. రాత్రి వేళలో హైమాస్ట్ లైట్ల ముందు నుంచి మర్రిచెట్టు వైపు చూస్తే మాత్రం ఊడల మర్రికి హైమాస్ట్ లైట్లు బిగించినట్లు చూపరులకు కనువిందు చేస్తోంది.



సేవాలాల్ చూపిన మార్గం అనుసరణీయం

• ఎమ్మెల్యే వినోద్



బంజారాలతో కలిసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి: సంత్ సేవాలాల్ చూపిన మార్గం అనుసరణీయమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బెల్లంపల్లి ఐటీడీఏ హార్టికల్చర్ నర్సరీ ఎదుట ఆదివారం సేవాలాల్ మహారాజ్ జయంతి నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే బంజరాలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల్లో ఉన్న బంజారా సమాజాభివృద్ధికి సేవాలాల్ ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. సాంస్కృతికంగా, ఆధ్యాత్మిక అభివృద్ధికి పాటు పడ్డారని గుర్తు చేశారు. ప్రస్తుత బంజారా సమాజం సేవాలాల్ మహారాజ్ బాటలో పయనించాలని సూచించారు. బెల్లంపల్లి బజారు ఏరియా సింగరేణి తిలక్ స్టేడియం నుంచి హార్టికల్చర్ నర్సరీ వరకు భారీ ర్యాలీ చేశారు. ర్యాలీలో బంజారా మహిళలు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ, బంజారా నాయకులు అజ్మీరా శ్రీనివాస్, బుక్య రాము నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు మల్లేష్ నాయక్, బంజారా సంఘ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోని అభివృద్ధిని పునఃప్రారంభించాలి

• మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులెన్నో ప్రారంభించి చేపడుతుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రద్దు చేశారని, వెంటనే వాటిని పునఃప్రారంభించేలా సీఎం రేవంత్‌రెడ్డి చూడాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. జిల్లాకు ఈ నెల 24న సీఎం వస్తున్న సందర్భంగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే తన నివాసంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే ఆగడాలను నియంత్రించి, మంచిర్యాలను కాపాడాలని కోరారు. మంచిర్యాల అంతర్గాం బ్రిడ్జిని గోదావరి నదిపై నిర్మించేందుకు రూ.164కోట్లను మంజూరు చేసి పనులను మొదలుపెట్టినట్లు, కాని దానిని స్థానిక ఎమ్మెల్యే ముల్కల్ల నుంచి ముర్మూర్ మీదుగా నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనికయ్యే ఖర్చు రూ.450 కోట్లు, 8కిలోమీటర్ల భూసేకరణ చేయాల్సి ఉంటుందన్నారు. ఇన్ని చేసినా హైదరాబాద్‌కు వెళ్లేందుకు కేవలం 5కిలోమీటర్లు దూరం మాత్రమే తగ్గుతుందన్నారు. గతంలో ప్రతిపాదించినట్లు బ్రిడ్జిని మంచిర్యాల అంతర్గాం మధ్య నిర్మిస్తే 18కిలోమీటర్ల దూరం తగ్గడంతో పాటు, రూ.164కోట్లు మాత్రమే ఖర్చు అవుతుందని, దీనివల్ల ప్రభుత్వ నిధులు మిగులుతాయన్నారు. ఐటీపార్కు, ఇండస్ట్రియల్ హబ్ పేరిట 300ఎకరాల భూమి, ఎకరానికి రూ.13లక్షలను పరిహారంగా ప్రకటించడం దారుణమని, ఎకరానికి రూ.50లక్షల ధర ఉందని, అందుకు తగినట్లుగా పరిహారం చెల్లించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్, మంచిర్యాల బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, నాయకులు తోట తిరుపతి, తాజుద్దిన్, శ్రీరాముల మల్లేశ్, జాఫర్, గరిగంటి కొమురయ్య, మహ్మద్ రఫీ, కర్రు శంకర్, పడాల రవీందర్, పడాల శ్రీనివాస్, పెంట ప్రదీప్, అక్కురి సుబ్బన్న, బేర సత్యనారాయణ పాల్గొన్నారు.

మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన మైనింగ్ స్టాఫ్ సబ్‌కమిటీ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ(ఏఐటీయూసీ)ని సీసీసీ కార్నర్‌లోని నర్సయ్య భవన్‌లో శనివారం రాత్రి ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ. సీతారామయ్య హాజరయ్యారు. నూతన కమిటీ మైనింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారం కోసం పని చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ముస్కె సమ్మయ్య, బ్రాంచీ కార్యదర్శి ఎస్కె బాజీసైదా, మైనింగ్ స్టాఫ్ రీజియన్ సెక్రెటరీ వంగరి రాజేశ్వరీరావు, ఉపాధ్యక్షులు రాజశేఖర్ పాల్గొన్నారు.

నూతన కమిటీ..

మైనింగ్ స్టాఫ్ ఏరియా ఉపాధ్యక్షులుగా అద్దు శ్రీనివాస్, కార్యదర్శిగా బాదావత్ బాలకృష్ణ, సహాయ కార్యదర్శిగా ఎల్.మహేశ్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ప్రవీణ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా అనుదీప్, దీక్షిత్, నారాయణ, శెట్టి శంకరయ్య, విలాస్‌వర్మ, రంజిత్, రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు.

బీఆర్‌ఎస్ దుకాణం బంద్

• ఎమ్మెల్యే బొజ్జు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

జన్నారం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకుండా వెనుకంజ వేసిన బీఆర్‌ఎస్ పార్టీ దుఖాణం, తెలంగాణలో బంద్ అయినట్లేనని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ఎమ్మెల్సీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర అగ్రో అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బాలరాజు పేర్కొన్నారు. మండలంలోని రేండ్లగూడ గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 24న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనను కాంగ్రెస్ కార్యకర్తలు విజయవంతం చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి నరేందర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ ఫసీఉల్లా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, సీనియర్ నాయకులు శుభాష్‌రెడ్డి, గుర్రం మోహన్‌రెడ్డి, ఇసాక్, శంకరయ్య, రియాజోద్దీన్, సుధాకర్ నాయక్, శంకర్, వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

‘ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి’



జిల్లా కేంద్రంలో ప్రచారం చేస్తున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని గౌతమినగర్, రాంనగర్ కాలనీల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా బీజేపీ ఆధ్వర్యంలో నిరుద్యోగుల పక్షాన బీజేపీ నిరంతరం పోరాటం చేసిందని, గత బీఆర్‌ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉద్యోగాలను కల్పించలేదని, నిరుద్యోగ భృతి ఇవ్వక యువతను మోసం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్‌కుమార్, దుర్గం అశోక్, పెద్దపల్లి పురుషోత్తం, ఆకుల అశోక్‌వర్ధన్, ఆవిడపు రాజాబాబు, బింగి ప్రవీణ్, కంకణాల సతీశ్, రెడ్డిమల్ల అశోక్, చక్రి పాల్గొన్నారు.

భూవివాదంలో ఇద్దరిపై కేసు

జైపూర్: మండలంలోని వేలాలలో ఆదివారం జరిగిన భూవివాదంలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఎస్సై కథనం ప్ర కా రం.. పెద్దపల్లి జిల్లా మంథనిలో నివాసం ఉంటు న్న ఐలి బానయ్య ఆదివారం వేలాలలోని తన ఇంటికి వచ్చాడు. ఇంటి స్థలంలో మహాశివరాత్రి జా తర సందర్భంగా బొమ్మల దుకాణం ఏర్పాటు చేసుకోగా, అదే గ్రామానికి చెందిన జాడి లింగయ్య, అతడి కుమారుడు రామకృష్ణ వాగ్వాదానికి దిగారు. బానయ్యతోపాటు అతడి భార్య దుర్గమ్మ, బంధువు రాజేశ్వరిపై దాడి చేశారు. ఇంటి స్థలం ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, భౌతికదాడి చేశారంటూ బానయ్య ఇచ్చిన ఫిర్యాదుతో లింగయ్య, రామకృష్ణపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

సంక్షిప్త వార్తలు

‘ఎమ్మెల్సీగా అవకాశం కల్పించండి’

నస్పూర్: రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ధర్మసమాజ్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి మంద జ్యోతి అన్నారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆమె ఆదివారం మాట్లాడారు. తాను గెలిస్తే పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఆర్థిక సాయం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రానికి చెందిన ప్లంబర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు మేకల శ్రీనివాస్ కూతురు వివాహం ఆదివారం జరగనుండడంతో తోటి ప్లంబర్లు, ప్లంబర్ అసోసియేషన్ సభ్యులు వివాహ ఖర్చుల కోసం రూ.65,000 నగదు ఆదివారం ఉదయం పెళ్లి పందిరిలో శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ప్లంబర్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు మల్లేష్, ఉపాధ్యక్షుడు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

26న కబడ్డీ పోటీలు

వేమనపల్లి: మండల కేంద్రంలోని శ్రీ విద్యానిధి పాఠశాల వద్ద 26, 27తేదీల్లో మధుకర్ స్మారక జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు సుధీర్‌కుమార్ తెలిపారు. వివరాలకు 84998 86275, 96406 69050లకు సంప్రదించాలన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

దండేపల్లి: మండలంలోని మాదాపూర్‌కు చెందిన బీమోల్ల వినయ్‌కుమార్ తన స్మార్ట్‌ఫోన్‌ను 3నెలల క్రితం పోగొట్టుకున్నాడు. దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వెతికి పట్టుకున్నారు. పోగొట్టుకున్న ఫోన్‌ను ఎస్సై తహిసినోద్దీన్ ఆదివారం వినయ్‌కుమార్‌కు అందించారు.

శ్రీరాంపూర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా..



• జీఎం మునిగంటి శ్రీనివాస్

శ్రీరాంపూర్: సింగరేణిలోనే శ్రీరాంపూర్ ఏరియాను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని నూతన జీఎం ఎం. శ్రీనివాస్ తెలిపారు. ఇదివరకు ఆర్కే 5, 6 గ్రూపు ఏజెంట్‌గా, ఇందారం ఓసీపీ ప్రాజెక్టు అధికారిగా ఆయన పనిచేశారు. అనంతరం పదోన్నతిపై బెలంపల్లి జీఎంగా వెళ్లాడు. అక్కడి నుంచి శ్రీరాంపూర్ జీఎంగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఏరియాలో బొగ్గు ఉత్పత్తి, రక్షణ చర్యలు, సంక్షేమంపై ఆయన ‘సాక్షి’కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను పంచుకున్నారు.

ప్ర: ఉత్పత్తి లక్ష్యాలు ఎంత వరకు రీచ్ అయ్యారు.?

జ: శ్రీరాంపూర్ ఏరియా వార్షిక ఉత్పత్తి లక్ష్యం 63లక్షల టన్నులుగా ఉంది. ఫిబ్రవరి 23నాటికే 56లక్షల టన్నులు సాధించాల్సి ఉంది. ఇప్పటి వరకు 48.10లక్షల టన్నులు సాధించాం. 86శాతం ఉత్పత్తి నమోదైంది. మార్చి 31నాటికి 60లక్షల టన్నుల వరకు చేరుకుంటాం.

ప్ర: ఓసీపీల్లో ఆశించిన ఉత్పత్తి ఎందుకు రావడం లేదు?

జ: ఇందారం ఓసీపీలో నిర్దేశించిన లక్ష్యంలో కేవలం 14.42శాతమే బొగ్గు ఉత్పత్తిని సాధించాం. కారణం ఇక్కడ ఓబీ కాంట్రాక్టర్ పనితీరే. ఆ సంస్థ వద్ద సరిపడా డంపర్లు, షవల్స్ లేవు. తక్షణమే వాటిని సమకూర్చుకోవాలని, పనితీరు మెరుగుపర్చుకోవాలని నోటీసులు ఇచ్చాం. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి బొగ్గు ఉత్పత్తి మెరుగుపడనుంది. ఇక శ్రీరాంపూర్ ఓసీపీలో మాత్రం గతంలో కంటే పుంజుకుంది. ఇప్పటి వరకు 106శాతం ఉత్పత్తి సాధించాం.

ప్ర: ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జ: గతంలో కంటే ప్రమాదాలు చాలా తగ్గాయి. జీరో హార్మ్ సింగరేణిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ఎస్ఎంపీలో భాగంగా ఎస్ఓపీలు, సీఓపీలను పగడ్బందీగా అమలు చేస్తున్నాం. రక్షణపై ఉద్యోగులకు మరింత అవగాహన కల్పిస్తూ ముందుకెళ్తాం.

ప్ర: శ్రీరాంపూర్‌లో మూతపడే గనులేవి?

జ: మే నెల నాటికి ఆర్కే 6 గని మూతపడనుంది. ఈ గనిలో పనిచేసే ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. వారిని వేరే ఏరియాలకు బదిలీ చేయకుండా శ్రీరాంపూర్‌లోనే సర్దుబాటు చేస్తాం. మిగిలిన ఒకటి రెండు గనుల్లో కూడా నిల్వలు అడుగంటాయి. దానిపై ఉన్నత స్థాయిలో చర్చించి నిర్ణయాలు తీసుకుంటాం.

విద్యార్థుల హంగామా



మందమర్రిరూరల్: మందమర్రి మండలం అందుగలపేటలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫేర్వేల్ హంగామా ఆకట్టుకుంది. కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఫేర్వేల్‌లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ హీరాలాల్, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 6 కొత్తరోడ్‌లోని శ్రీ లక్ష్మీ శిశు మందిర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 2002–03 టెన్త్ బ్యాచ్ విద్యార్థులంతా కలుసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆట పాటలతో సందడి చేశారు. తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు.

చెత్త తొలగించిన వాకర్స్

చెన్నూర్: చెన్నూర్ పెద్ద చెరువు ట్యాంక్ బండ్ పై ఉదయం, సాయంత్ర వేళల్లో పట్టణవాసులు వాకింగ్ చేస్తున్నారు. ట్యాంక్ బండ్‌పై ఉన్న చెత్తను ఆదివా రం వాకర్స్ సభ్యులు తొలగించారు. చెరువు కట్టపై లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.